క్లుప్తంగా

మోకు దెబ్బ జిల్లా కార్యదర్శిగా మల్లేశంగౌడ్



తొర్రూరు రూరల్: గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ జిల్లా కార్యదర్శిగా మండలంలోని గుర్తూరు గ్రామానికి చెందిన మేరుగు మల్లేశం గౌడ్‌ను నియమిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ నియామక పత్రాన్ని సోమవారం అందించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

గూడూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని జిల్లా నాయకుడు పాదిళ్ల నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2029ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారం చేపడుతుందన్న నమ్మకాన్ని ఇప్పటి నుంచే కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాసమల్ల వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ నాయిని ధర్మారెడ్డి, ఎంపీపీ చెల్పూరు వెంకన్న, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి గుగులోతు రాంబాబు, శ్రీశైలం, విజయశ్రీ, నాగేశ్వర్‌రావు, పడాల నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



మహబూబాబాద్: మానుకోట మండలంలోని కంబాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో 1988–89 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన అక్బర్ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో తోటి మిత్రులు సోమవారం రూ.37,500 ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో మిత్రులు నూకల సుధీర్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, భీముడు వెంకటప్పయ్య, జయపాల్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల ఆక్రమణకు కేంద్రం కుట్ర

మహబూబాబాద్ అర్బన్: వక్ఫ్ ఆస్తులు అక్రమణకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని జేఏసీ ఉద్యమ నేత చైర్మన్ డాక్టర్ డోలి సత్యనారాయణ అన్నారు. వక్ఫ్ బిల్లు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నల్లబ్యాడ్జీల ధరించి ముస్లిం నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఉద్యమ, వామపక్ష, కుల, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్ సాహెబ్, ఫజల్, ఇబ్రహిం, రహీం, జాకీర్, నజీర్, జావీద్, నయీమ్, షకీల్, సత్తార్, యూసఫ్ పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

పెద్దవంగర: పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు జాగ్రత్తలు వహించాలని మండల పశువైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని బొమ్మకల్లు గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు కేతిరెడ్డి సోమనర్సింహారెడ్డి, సిబ్బంది సంధ్య, అనిల్, హసన్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి విరాళం



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి శేరి వీరయ్య పాఠశాల అభివృద్ధి కోసం రూ.20వేలు సోమవారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గుగులోత్ లక్ష్మి, ఉపాధ్యాయులు రవి, రాధిక, సువర్ణ, కవిత, శ్రీజ పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్ అందజేత



దంతాలపల్లి: మండల కేంద్రానికి చెందిన సేను రాజేష్ తన భార్య మహేశ్వరి జ్ఞాపకార్థం, నెల్లూరి యాకయ్య తన తండ్రి నారాయణ జ్ఞాపకార్థం చెరో రూ.36వేల చొప్పున రూ.73వేల విలువ చేసే ఫ్రీజర్‌ను గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకన్న, ఎస్సై పిల్లల రాజు, నాయిని శ్రీనివాస్ రెడ్డి, సంపెట సురేష్, యాకయ్య పాల్గొన్నారు.

నార్మల్ డెలివరీతో ఆరోగ్యం

గార్ల: నార్మల్ డెలివరీలతోనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని గార్ల సీహెచ్‌సీ డాక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రిలో ఎస్.స్వప్నకు నార్మల్ డెలివరీ చేయగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కార్యక్రమంలో హెడ్ స్టాఫ్‌నర్సు స్వాతి, స్టాఫ్‌నర్సులు రమాదేవి, నాగమణి, పుష్పలత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పోస్టుమార్టం గది ప్రారంభమెప్పుడో?

- నిర్మాణం పూర్తయి 8నెలలు..
- మృతదేహాలను జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్తూ ఆర్థికంగా నష్టపోతున్న పేదలు
- ప్రారంభించాలని కోరుతున్న ప్రజలు



ప్రారంభానికి నోచుకోని నూతన పోస్ట్‌మార్టం భవనం

గార్ల: గార్ల కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ (సీహెచ్‌సీ)లో నూతన పోస్టుమార్టం భవనం నిర్మాణం పూర్తయి 8నెలలు గడుస్తున్నా, నేటికీ ప్రారంభించక పోవడంతో మృతదేహాలకు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించడం లేదు. సీహెచ్‌సీ వైద్యులు మాత్రం సరిపడా సిబ్బంది ఉన్నా ప్రమాదవశాత్తు చనిపోయిన, పురుగుమందు తాగి మృతిచెందిన మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించడం లేదు. దీంతో మృతదేహాల పోస్ట్‌మార్టం కోసం నిరుపేదలు రూ.10,000 ఖర్చు పెట్టుకొని వాహనం మాట్లాడుకొని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు. గార్లలో 6ఏళ్ల క్రితం సకల సౌకర్యాలతో నాటి ప్రభుత్వం రూ.5కోట్లు వెచ్చించి 30పడకల ఆస్పత్రిని నిర్మించింది. కాని ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం భవనంను విస్మరించింది. దీంతో మండలంలోని వామపక్ష పార్టీల నాయకులు సీహెచ్‌సీలో పోస్ట్‌మార్టం భవనం నిర్మించాలని పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టగా ఎట్టకేలకు ఆస్పత్రి వెనుకభాగంలో ప్రభుత్వం 8నెలల క్రితం నూతన పోస్టుమార్టం భవనం నిర్మాణం చేపట్టింది. కాని ఈ పోస్ట్‌మార్టం భవనంలో రైలు, రోడ్డు ప్రమాదాలు, పురుగుమందు తాగి ఆత్మహత్యలు చేసుకున్న మృతదేహాలకు సీహెచ్‌సీ వైద్యులు పోస్ట్‌మార్టం నిర్వహించడంలో ఆసక్తి కనబర్చడం లేదు. మృతదేహాలకు పోస్ట్‌మార్టం నిర్వహిస్తే సాక్ష్యం కోసం మాటిమాటికి వైద్యులు కోర్టుకు వెళ్లాల్సి వస్తుందని, మనకెందుకు రిస్క్ అని వైద్యులు తప్పించుకుంటున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా కలెక్టర్, జిల్లా డీసీహెచ్ఎస్ స్పందించి సకల సౌకర్యాలు ఉన్న స్థానిక సీహెచ్‌సీ ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్ట్‌మార్టం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని వివిధ పార్టీల నాయకులు, మండల ప్రజలు డిమాండ్ చేశారు.

ఆర్థికంగా నష్టపోతున్నారు..



గార్ల సీహెచ్‌సీలో వైద్యులు, వైద్యసిబ్బంది ఉన్నా మృతదేహాలకు పోస్ట్‌మార్టం చేయడం లేదు. వైద్యులు, వైద్యసిబ్బంది నిర్లక్ష్యం వలన, పోస్ట్‌మార్టం కోసం మృతదేహాలను రూ.10వేలు ఖర్చు పెట్టి వ్యాన్ తీసుకొని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి వెళ్తూ నిరుపేదలు ఆర్థికంగా నష్టపోతున్నారు. కలెక్టర్ స్పందించి సీహెచ్‌సీలో పోస్ట్‌మార్టం నిర్వహించేలా చర్యలు చేపట్టాలి.

– ఇమ్మడి గోవింద్, గోపాలపురం

తాగునీరు రావడం లేదని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

నెల్లికుదురు: వారం రోజుల నుంచి తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులతో మొరపెట్టుకున్న అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కనీసం కలెక్టర్ ఆదేశాలను లెక్కచేయడం లేదని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నల్లాని పాపారావు, బీఆర్ఎస్ నాయకుడు బైస రమేశ్ అధికారులపై మండిపడ్డారు. మండలంలోని మునిగలవీడు గ్రామంలో 10రోజుల నుంచి తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు సోమవారం రాస్తారోకో చేపట్టారు. గ్రామంలో మంచినీటి కొరత లేదని ఎంపీఓ పద్మ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

రైతు సేవకే పునరంకితం కావాలి



సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ రూరల్: ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) కమిటీదేనని, ఆత్మ కమిటీ రైతు సేవకే పునరంకితం కావాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రు నాయక్ అన్నారు. సోమవారం మరిపెడ మండలంల గిరిపురం గ్రామ రైతు వేదికలో మరిపెడ డివిజన్ వ్యవసాయ అధికారి విజయ్ చందర్ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన మరిపెడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డితో పాటు 23 మంది కమిటీ డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, నూకల అభినవ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరరెడ్డి, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, కాలం రవీందర్‌రెడ్డి, కాలం శ్రీనివాస్‌రెడ్డి, అఫ్జల్, ఉపేందర్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్



కురవి: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

కురవి: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. కురవి, సీరోలు మండలాల్లోని కందికొండ, చింతపల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మహబూబాబాద్ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, రెండు మండలాల పార్టీ అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, అంబటి వీరభద్రం గౌడ్, బండి శ్రీనివాస్, జెరిపోతుల మహేష్‌గౌడ్, దువ్వ సైదులు, చందూలాల్, సతీష్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

మరిపెడ రూరల్: మండలంలోని తానంచర్ల శివారు పాలేరు వాగు ఒడ్డును స్వయంభూగా వెలసిన గంగాభవాని ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. జాతరకు ఎమ్మెల్యే హాజరై ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సమాచార హక్కు మాజీ కమిషనర్ గుగులోతు శంకర్‌నాయక్, నాయకులు యుగేందర్‌రెడ్డి, పురుషోత్తమరెడ్డి, తాజుద్దీన్, ఐలమల్లు, కోట వెంకట్‌రెడ్డి, గుగులోతు రవి, పాశం నరేష్‌రెడ్డి, మచ్చ వెంకటనర్సు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మరిపెడ రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకుని, ముగ్గురి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బొలగాని సతీష్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మరిపెడ మండలంలో అకేరు, పాలేరు వాగుల నుంచి ఇసుక రవాణాను అడ్డుకట్ట వేసేందుకు రెవెన్యూ, పోలీస్ శాఖలు సంయుక్తంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, మండలంలోని బీచ్‌రాజ్ పల్లి గ్రామానికి చెందిన చిదుముల విజయ్, బాల్నిధర్మారానికి చెందిన గుడిమల్ల ఉపేందర్, చిన్నగూడూరు మండలం విస్సంపల్లికి చెందిన బొమ్మ రవిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



మరిపెడ/నర్సింహులపేట: పిల్లలు, మహిళలకు పోషకాహారాన్ని అందించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి గుగులోతు రవి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మరిపెడలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మీ, సీడీపీఓ ఎల్లమ్మ , అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశలు పాల్గొన్నారు.

అమెరికాతో ఒప్పందాలు విరమించుకోవాలి



తొర్రూరులో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

తొర్రూరు: అమెరికాతో భారత్ ఒప్పందాలు విరమించుకోవాలని వామపక్ష సంఘాల నాయకులు పేర్కొన్నారు. భారత్‌ను అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ రాకను నిరసిస్తూ వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో నిరసన తెలిపారు. అమెరికాకు లాభం చేకూర్చేలా ప్రధాని మోదీ వ్యవహరిస్తున్నాడన్నారు. కార్యక్రమంలో నాయకులు ముంజంపల్లి వీరన్న, ఎండీ యాకూబ్, ఆలకుంట్ల సాయిలు, ఊడుగుల లింగన్న, జమ్ముల శ్రీను, యాకాంతం, వల్లపు సాయిలు పాల్గొన్నారు.

అమెరికా ఉపాధ్యక్షుడి పర్యటనను నిరసిస్తూ ఆందోళన

బయ్యారం: అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ భారత పర్యటనను నిరసిస్తూ సోమవారం మండలకేంద్రంలో వామపక్ష ప్రజా, రైతుసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. దేశంలో వ్యవసాయరంగంను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే అమెరికా ఉపప్రధాని పర్యటనను భారతదేశంలో నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు, మండ రాజన్న, బిల్లకంటి సూర్యం, భిక్షం, పాల్గొన్నారు.

నిధుల కోతతో విద్యారంగానికి నష్టం

డోర్నకల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి నిధుల కేటాయింపులో కోత విధించడంతో నష్టం జరుగుతుందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి తెలిపారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం జరిగిన జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు జొన్నకూటి గ్రేసమ్మ పదవీ విరమణ సన్మానోత్సవ కార్యక్రమానికి హాజరైన మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం బండి నర్సింహారావు, బీసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శులు నామా వెంకటేశ్వర్లు, వివేక్, మండల అధ్యక్ష కార్యదర్శులు అజీజ్, శివప్రసాద్, ఎంఈఓ ఆంగోత్ లక్ష్మా పాల్గొన్నారు.

అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై సునంద

నెహ్రూసెంటర్: మహిళలు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పని చేసే ప్రదేశాల్లో వేధింపులకు గురైతే వెంటనే షీటీంకు తెలపాలని షీటీం ఎస్సై సునంద అన్నారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మహిళల భద్రత, రక్షణ, హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, డ్రగ్స్, మత్తు పదార్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఈవ్‌టీజింగ్, పని ప్రదేశాల్లో వేధింపులకు గురైతే వెంటనే షీటీంకు లేదా 100 డయల్ చేయవచ్చని, షీటీం నంబర్ 87126 56935 ఫోన్ చేసి చెప్పాలన్నారు. టీసేఫ్ యాప్ ట్రావెలర్ యాప్ అని ట్రావెలింగ్ చేసే ప్రతీ ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ జగదీశ్వర్, ఏఓ గఫర్, షీ టీం ఉమెన్ పీఎస్ ఎస్సై ఆనందం, షీటీం సిబ్బంది అరుణ, పార్వతి, రమేశ్, ఏహెచ్‌టీ సిబ్బంది సుప్రజ, భరోసా సిబ్బంది బేబీ, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో సౌకర్యాలు కల్పించాలి



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న వివేక్

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని సామాజికవేత్త డాక్టర్ వివేక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జీఎంసీని సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య కళాశాలలో భవనాలు, హాస్టల్ భవనాలు, ఆసుపత్రికి సంబంధించిన పనులను పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి భవనాలను పూర్తి చేసి విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్, విష్ణు, శాంతికుమార్, సాయికుమార్, సూర్యప్రకాశ్, శివవర్మ పాల్గొన్నారు.

అధిక ధరలను నియంత్రించాలి



మాట్లాడుతున్న విజయసారథిరెడ్డి

మహబూబాబాద్: అధిక ధరలను వెంటనే నియంత్రించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా విజయసారథి మాట్లాడుతూ.. ధరలు పెరగడంతో పేదలపై తీవ్రభారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎం మోదీ కేవలం కార్పొరేట్‌లకే ప్రధాన మంత్రిగా వ్యవహరిస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం పతనం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు అజయ్ సారథిరెడ్డి, శ్రీనివాస్, ఇక్బాల్, ఫరీద్ రియాజ్, చాంద్, పెరుగు కుమార్, నవీన్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేత జట్టుతో నిర్వాహకులు

తొర్రూరు: క్రీడలతో ఆరోగ్యంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందని తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. అనుమాండ్ల మాధవరెడ్డి స్మారకార్థం వాలీబాల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ముగిశాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జట్లు పాల్గొనగా రఘునాథపల్లి జట్టు ప్రథమ స్థానంలో, మేడారం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గొడిశాల నగేష్, ఎంఈఓ బుచ్చయ్య, ప్రతినిధులు వాసిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, సూరం ఉపేందర్‌రెడ్డి, కొండం జనార్దన్, హెచ్ఎం లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

తక్షణమే సస్పెండ్ చేయాలి

గంగారం: మహబూబాబాద్ జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా విధులు నిర్వహిస్తున్న గుగులోత్ దేశిరామ్‌ను సస్పెండ్ చేయాలని తుడుం దెబ్బ కార్యనిర్వాహక అధ్యక్షుడు పులసం మునేష్ కోరారు. గంగారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలోఆయన మాట్లాడుతూ.. సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో పనిచేస్తున్న ఆదివాసీ, గిరిజన ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులపై ప్రైవేట్ వ్యక్తులతో, ఆయా పాఠశాలలు, ఆశ్రమ వసతి గృహాలలో సమస్యలు లేకపోయిన ఉన్నట్లుగా పేపర్ స్టేట్‌మెంట్స్ ఇప్పిస్తూ ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. తక్షణమే డీడీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

బడిబాట ప్రారంభం

కేసముద్రం: మండలంలోని కల్వల, అన్నారం గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించాలంటూ ఉపాధ్యాయులు తెలియజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం నరేందర్, హెచ్ఎం క్లౌం వీరారెడ్డి, ఉపాధ్యాయులు గోపి, స్వరూప, హరికృష్ణ, కృష్ణ, శ్రీదేవి పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

దంతాలపల్లి: ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల రాజన్న అన్నారు. సోమవారం మండలంలోని దాట్ల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు.

వార్డెన్‌పై చర్య తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్‌పై చర్య తీసుకొని, వెంటనే సస్పెండ్ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్, జిల్లా అధ్యక్షుడు రమేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఏటురునాగరం ఐటీడీఓ పీఓ చిత్ర మిశ్రాకు ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్లు, హెచ్ఎంలను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

విజయవంతం చేయాలి

నెహ్రూసెంటర్: ఈనెల 27వ తేదీన కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పూలే, అంబేడ్కర్ జన జాతర సభను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సూర్నపు సోమయ్య పిలుపునిచ్చారు. సభ కరపత్రాలను జిల్లా కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు.

సన్మానం

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలో షాదీఖాన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.80లక్షలను మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మండలంలోని అర్పనపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని సోమవారం ముస్లింలు సన్మానించారు. కార్యక్రమంలో షేక్ జావిద్, షేక్ అక్బర్, మహ్మద్ అల్లావుద్దీన్, షేక్ నాయిాం, షేక్ ఖాదర్, హఫీజ్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తానంచర్ల శివారు పాలేరు వాగుపై స్వయంభూగా వెలసిని గంగమ్మ తల్లిని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ దర్శించుకున్నారు. సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న, రామసహాయం సత్యనారాణరెడ్డి, గుగులోతు రాంబాబు, తేజావత్ రవీందర్‌నాయక్, దిగజర్ల ముఖేష్, దిగజర్ల శ్రీనివాస్, దయ్యాల లింగయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

తొర్రూరు రూరల్: మండలంలోని వెలికట్ట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. కార్యక్రమంలో నాయకులు దేశగాని భిక్షపతి, కొండల్‌రెడ్డి, ఎండీ యూసుఫ్, దీకొండ విష్ణువర్ధన్, హమ్యానాయక్, సుంచు సంతోష్ పాల్గొన్నారు.

పట్టాలను పునరుద్ధరించాలి

కొత్తగూడ: గత ప్రభుత్వం హయాంలో ఏజెన్సీ ప్రాంతంలో రద్దయిన పట్టాలను పునరుద్ధరించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన భాస్కర్ డిమాండ్ చేశాడు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పెండకట్ల సమ్మయ్య, లక్ష్మినర్సు, సారంగపాణి, రామస్వామి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని ధన్నసరి క్రాస్‌రోడ్డు వద్ద ధన్నసరి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ మర్రి రంగారావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నీలం దుర్గేష్, సొసైటీ డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, సేవేందర్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ

చిన్నగూడూరు: మండలంలోని గుండంరాజుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ఎండీ కదీరుద్దీన్ పదవీ విరమణ అభినందన సభ హెచ్ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.

బియ్యం అందజేత

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రం విలేజ్‌లో కుమారస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు టీపీసీసీ ఓబీసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్నయాదవ్, కాంగ్రెస్ గ్రామ ఉపాధ్యక్షుడు కత్తెరశాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్వింటా బియ్యం బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు.

జాతీయ సమైక్యతను పెంపొందించుకోవాలి



హరియాణా వంటకాల ప్రదర్శన

గూడూరు: విద్యార్థులు జాతీయ సమైక్యతను పెంపొందించుకోవాలని ఎంఈఓ రవికుమార్ అన్నారు. మండలంలోని జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం ఏక్ భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హరియాణా రాష్ట్ర సంప్రదాయ దుస్తులను ధరించారు. అక్కడి వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, జ్యోతిరాణి, కల్యాణి, రాణి, షాహిద్, అలీ, జగదీశ్వర్, చంద్రమౌళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డుపై చెట్టు కొమ్మలను తొలగించిన ఎస్సై

గార్ల: గార్ల – డోర్నకల్ మధ్యలో ఆదివారం రాత్రి వీచిన ఈదుర గాలులకు రోడ్డుపై చెట్టు కొమ్మలు పడిపోవడంతో వెంటనే ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా సిబ్బందితో వెళ్లి రోడ్లపై చెట్టు కొమ్మలను తొలగించి రహదారి క్లియర్ చేశారు.

ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గార్ల: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగు, తాగునీటిని ఇల్లెందు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు అందించాలని కోరుతూ సోమవారం న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈధర్నాను ఉద్దేశించి న్యూడెమోక్రసీ పార్టీ మండల కార్యదర్శి జి.సక్రు మాట్లాడారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్ట్ ద్వారా సాగు, తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శ్రీరామ్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాన్యా, సీహెచ్ గణేశ్, రైతులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మహబూబాబాద్ :
9010144453
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
బి. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646